## వైభవం.. అమ్మవారి తిరుచ్చివాహనసేవ



శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఉన్న అమ్మవారి ఉత్సవమూర్తి జ్ఞానప్రసూనాంబికాదేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంక రించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలనడుమ అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## తిరుచ్చిపై పద్మావతి దేవి విహారం



తిరుచానూరు, జులై 21, ప్రభాతవార్త

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై నాలుగు మాడా వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణ స్వామి ముఖ్య మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. సాయంత్రం ఉంజల్ సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. కార్యక్రమంలో ఏవిఎస్వో శైలేంద్ర బాబు, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, మధు ఆగమ సలహాదారు శ్రీనివాసా చార్యులు, విఐ రామ్మోహన్, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, అశోక్, సూభాస్కర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గగన్‌యాన్ పరీక్షలు షురూ



ఇస్రో నిర్వహించిన గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్ పరీక్ష

శ్రీహరికోట (తడ), జూలై 21 ప్రభాతవార్త

చంద్రయాన్ తర్వాత ఇస్రో గగన్‌యాన్‌పై దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించి ముందస్తు పరీక్షలు మళ్లీ మొదలయ్యాయి. ఇందులో భాగంగా గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం (ఎస్ఎంపిఎస్)ను విజయవంతంగా నిర్వహించారు. ఇస్రో శాస్త్రవేత్తల ఆధ్వర్యాన తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఐపిఆర్‌సి సెంటర్‌లోని ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్ష విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈ పరీక్షలో 440 ఎన్ థ్రస్ట్‌తో ఐదు లిక్విట్ అపోజి మోటార్ ఇంజన్లు, 100 ఎన్ థ్రస్ట్‌తో 16 రియాక్షన్ కంట్రోల్ సిస్టంలు పరీక్షించారు. సుమారు 250 సెకన్ల పాటు నిర్వహించిన పరీక్షలో లిక్విడ్ అపోజి మోటార్ ఇంజన్లు, రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లను పరీక్షించి సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఇటువంటి హాట్ టెస్ట్‌లు గగన్‌యాన్ ప్రయోగానికి ముందు ఇంకా మరికొన్ని జరపాల్సి ఉంది. అన్నీ విజయవంతమైన తర్వాత మానవ రహిత గగన్‌యాన్ ప్రయోగాన్ని శ్రీహరికోట నుంచి జరపడానికి శాస్త్రవేత్తలు ఉవ్విళ్లూరుతున్నారు. ఇటీవల జరిగిన చంద్రయాన్-3 ప్రయోగంలో ఎల్‌విఎం3-ఎం4 రాకెట్‌కు ఉపయోగించిన రెండు అతిపెద్ద ఘన ఇంధన బూస్టర్లు గగన్‌యాన్ ప్రయోగానికి సరికొత్త ఊతమిచ్చినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఎస్200లుగా పిలిచే ఆ బూస్టర్లను సరికొత్త సామర్థ్యంతో శక్తివంతమైనవిగా రూపొందించడం, అవి గగనతలానికి గురితప్పకుండా దూసుకెళ్లడం వల్ల ఇటువంటి బూస్టర్లను గగన్‌యాన్ ప్రయోగానికి ఉపయోగించే అవకాశం ఉన్నట్లు ఇస్రో వర్గాలు చెబుతున్నాయి.

**పిఎస్ఎల్‌వి సి-56 ప్రయోగం 30న**

శ్రీహరికోట నుంచి ఈ నెల 26న జరపతలపెట్టిన పిఎస్ఎల్‌వి సి-56 కమర్షియల్ రాకెట్ ప్రయోగాన్ని ఈ నెల 30కి మార్పు చేశారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకే ఈ రాకెట్ సింగపూర్ దేశానికి చెందిన ఉపగ్రహాలతో అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. ఈ నెల 25న చంద్రయాన్-3కి సంబంధించి 5వ ఆర్బిట్ రైజింగ్ ఆపరేషన్ జరపనున్న కారణంగా ఇస్రో శాస్త్రవేత్తలు ఆ మరునాడు ఉదయమే మరో ప్రయోగం హడావుడిగా జరపడం ఎందుకని, నాలుగురోజులు వాయిదా వేసినట్లుగా తెలుస్తోంది.

# బీసీలు సమాజానికి బ్యాక్‌బోన్ లాంటి వారు

### - సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి




చేనేత కార్మికులకు రుణాల చెక్కును పంపిణీ చేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

వెంకటగిరి, జులై 21, ప్రభాతవార్త:

బీసీలు వెనుకబడిన వారు కాదని, సమాజానికి బ్యాక్‌బోన్ లాంటి వారని సీఎం జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వెంకటగిరిలో చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం నగదును కార్మికుల ఖాతాల్లో ల్యాప్‌టాప్ బటన్ నొక్కి సీఎం పంపిణీ చేశారు. 80 వేల మందికి 193 కోట్ల రూపాయలను సీఎం ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. పాదయాత్రలో చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకుని నేతన్న నేస్తం పథకం ద్వారా సంవత్సరానికి 24వేల రూపాయలను ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నాలుగు సార్లు ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. ఈరోజు ఐదోసారి నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన చేనేత కార్మికులను ఆదుకోవాలని నేతన్న నేస్తం పథకం ద్వారా నగదు ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేనేత కార్మికులను విస్మరించిందని తెలిపారు. తమ ప్రభుత్వం అభివృద్ధిని కాంక్షిస్తుందని, టీడీపీ అభివృద్ధిని నిరోధిస్తుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చమని తెలిపారు. వెంకటగిరిలో చేనేత కార్మికుల ప్రతిభకు రాష్ట్రపతి అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికుల జీవితాల్లో వైసీపీ ప్రభుత్వం వెలుగు నింపుతుందన్నారు. దుష్ట చతుష్టాలు వైసీపీ ప్రభుత్వం మీద, మా మంత్రులు, ఎమ్మెల్యేల మీద లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారి ఆరోపణలు పట్టించుకోకుండా మీ బిడ్డను దీవించాలని కోరారు. చేనేత కార్మికులు సీఎంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎస్‌వీబీసీ చైర్మన్ డాక్టర్ వి.బి.సాయికృష్ణ యాచేంద్ర, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి లు పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తాం



జ్యోతిని వెలిగిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం వెంకటగిరిలో నేతన్న నేస్తం నగదు పంపిణీకి వచ్చిన సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పోలేరమ్మ జాతరను జాతర పండుగగా గుర్తించాలని కోరడంతో సీఎం అంగీకరించారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ కూడా నిధులు ఇస్తామని ప్రకటించారు. ఎస్సీ గురుకుల పాఠశాల మంజూరు చేస్తానని, చేనేత భవనం నిర్మాణాలకు నిధులు ఇస్తానని తెలిపారు. పట్టణంలో డ్రైనేజీలు నిర్మాణానికి నిధులు కావాలని కోరగా ఒక్కొక్క సచివాలయానికి 50 లక్షల రూపాయలు ఇస్తానని అభివృద్ధి పనులు చేయాలని సీఎం రామ్‌కుమార్‌రెడ్డికి సూచించారు. గడప గడపకు తిరిగి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని రామ్‌కి సూచించానని సీఎం తెలిపారు. పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగగా గుర్తించాలని రామ్‌కుమార్‌రెడ్డి సూచన మేరకు సీఎం అంగీకరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోరిన కోరికలు తీర్చే అమ్మవారు జాతర వైభవంగా చేసినందుకు రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించినందు వలన ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు సంతోషిస్తున్నారు. రామ్‌కుమార్‌రెడ్డి కోరిన హామీలన్నింటినీ సీఎం వెంటనే అంగీకరించి అనుమతులు ఇస్తానని తెలిపారు.

## కారణజన్ముడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి



వెంకటగిరి, జులై 21, ప్రభాతవార్త:

మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కారణజన్ములని సీఎం జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వెంకటగిరి మీ సేవ కేంద్రం కూడలిలో మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర సీఎంగా జనార్ధన్‌రెడ్డి ఎంతో హుందాగా వ్యవహరించినట్లు తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గాన్ని కూడా ఆయన ఎంతగానో అభివృద్ధి చేశారని తెలిపారు. తండ్రి రాజశేఖర్‌రెడ్డి జనార్ధన్‌రెడ్డితో కలిసి రాష్ట్రంలో రాజకీయాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జనార్ధన్‌రెడ్డి సతీమణి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, వైసీపీ జిల్లా అధ్యక్షులు రామ్‌కుమార్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి మనుమడు విక్రమ్‌కుమార్‌రెడ్డి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాల సేవలు భేష్

### - జెకెసి స్పెషలాఫీసర్ వీరపాండ్యన్



కుప్పం, జూలై 21 ప్రభాతవార్త

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు భేష్ అని జెకెసి స్పెషలాఫీసర్, సీనియర్ ఐఎఎస్ అధికారి వీరపాండ్యన్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం నియోజకవర్గంలో స్పెషలాఫీసర్ వీరపా ండ్యన్ పర్యటించారు. ఈసందర్భంగా కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు అందిస్తున్న ఎరువులు, విత్తనాలు, రాయితీల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బికెలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఎఒ మురళీకృష్ణ, ఎడిఎ అన్నపూర్ణదేవి, ఎఒ అమృతవల్లి, ఎఇఒ ఔరంగ్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చెక్కునత్తంలో భూముల రీసర్వేను ఆయన పరిశీలించారు. అంతకుముందు స్పెషలాఫీసర్ బెగ్గిలపల్లిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ, గుత్తార్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేశారు. గుడుపల్లెలో చౌక దుకాణం, హాస్టల్‌ను తనిఖీ చేశారు. శాంతిపురం మండలంలో నాడు-నేడు పనులు, పిహెచ్‌సి కేంద్రాన్ని స్పెషలాఫీసర్ పరిశీలించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్లు పార్వతి, గుర్రప్ప, నరసింహులు, డిటిలు, ఆర్‌ఐలు హాజరయ్యారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పూరీ పీఠాధిపతి



శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయుంభువు సేవలో శుక్రవారం పూరీలోని ఆశ్రమ పీఠాధిపతి పాల్గొన్నారు. పూరీ జగన్నాథ స్వామి శుద్దానంద గిరి స్వామి తన పరివారంతో విచ్చేసారు. వారికి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో ఆలయమర్యాదలతో స్వాగతంపలికారు. ఆయన దగ్గరుండి స్వామికి అంతరాలయ దర్శనాలు ఏర్పాటు చేసారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ మర్యాదలతో సత్కరించారు. తీర్థ ప్రసాదాలనుఅ ందించారు. ఏర్పాట్లను ఆలయ ఇన్సెపెక్టర్ హరియాదవ్, వేదపండితులు మారుతి శర్మ, దర్భా బాలసుబ్రమణ్యంశర్మ, శ్రీవాస్తవ్, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

## ఎర్రగుడిపాడులో దేశం పాదయాత్ర

శ్రీకాళహస్తిరూరల్, జూలై 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడులో శుక్రవారం ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమాలను నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు మీ ఆశీర్వాదం కోసం వచ్చాను. మా తండ్రిలాగే మీకు అన్ని తోడుగా ఉంటానని ఒక్క అవకాశం కల్పించాలని సుధీర్‌రెడ్డి కోరారు. మా నాన్న హయాంలో గ్రామాల్లో అభివృద్ధి కనబడేది. నేడు గ్రామంలో ఒక్క పని అయినా చేసారా? అభివృద్ధి మా అభిమతం ప్రజా స ంక్షేమమే మా అజెండా అని ప్రజలకు వివరించారు. ఇక తాము అధికారానికి వచ్చిన వెంటనే సామాజికాభివృద్ధియే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ప్రతి గ్రామానికి రోడ్డు, మంచినీటి సదుపాయం కల్పిస్తామని వివరించారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమాలకు జనం నుంచి మంచి స్పందన వచ్చింది, గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లోక్లస్టర్ ఇన్‌చార్జి రంగినేని చెంచయ్యనాయుడుమాజీ సింగిల్ అధ్యక్షుడు తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి షాకిర్ అలి, యూనిట్ ఇన్‌చార్జి నరసయ్య, గ్రామస్తులు చంద్రయ్యనాయుడు, మురళినాయుడు, భాస్కర్‌నాయుడు, హరి, వెంకటేశ్వర్లు, సుబ్బరామయ్య, గురవయ్య, మస్తానయ్య, వెంకటాద్రి, వెంకటేష్, సుఖేంద్ర నాయకులు పాల్గొన్నారు.

# కాస్తంత స్థలం కనబడిందా? వేసేయ్ పాగా!!

### తొట్టంబేడు మండలంలో విచ్చల విడిగా భూదందాలు

తొట్టంబేడు, జూలై 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో కాస్తంత స్థలం కనబడితే వేసేయ్ పాగా అన్నట్లు మారింది. రాత్రికి రాత్రి చదును చేయటం తెల్లారేసరికి రియల్‌ఎస్టేట్లుగా మార్చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా గిరిప్రదక్షిణ మార్గంలో కొండలను పిండి చేస్తున్నారు. పట్టణ పొలిమేరల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారుతుంది. ఇప్పటికే ప్రభుత్వ స్థలాలు మాయమయ్యాయి. రాత్రికి రాత్రే ఆక్రమణ స్థలాలకు రికార్డులు తయారౌతున్నాయి. ఆవగింజంత స్థలం కనబడితే చాలు ఇక వేసేయ్ అన్నట్లు మారింది. ఈ నేపథ్యంలో చెన్నై-నాయుడుపేట బైపాస్‌రోడ్డు బాగా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతాల్లో ఎస్‌డికె నగర్ వేగంగా అభివృద్ధిలో పరుగులు తీస్తుంది. ఈ నేపథ్యంలో రోడ్డు పక్కనే కాలువ పొరంబోకు స్థలాన్ని చదును చేసేసారు. ఇదేమి చోద్యమంటే మాకు పట్టాలున్నాయి. రికార్డులున్నాయంటూ దాఖలాలు చూపుతున్నారు. అంటే ఆక్రమణదారులకు అధికారుల అండదండలు మెండుగా ఉన్నాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో బసవయ్యపాళెం సమీపంలో ఆక్రమణల పర్వం ప్రారంభమైంది. ఇవే కాకుండా తొట్టంబేడు మండలంలో ఇటీవల రోజురోజుకు కబ్జాలు పెరిగిపోతున్నాయి. ఎక్కడ సెంటు స్థలం కనిపించినా కబ్జారాయుళ్ళు దర్జాగా కబ్జాచేసేస్తున్నారు. ఈనేపథ్యంలో బసవయ్యపాళెం-నాయుడుపేట హైవే రోడ్డు పక్కనే ఒకళ్యాణమండపం ఎదురుగా సర్వేనంబర్



చాకలిమాన్యంలో నిర్మాణలు చేపట్టిన దృశ్యం

52లో కాలువ పోరంబోకు స్థలం ఉంది. దీనిపై రియల్ వ్యాపారులు, కబ్జాదారులు కన్నుపడింది. కాలువ పోరంబోకు స్థలం వెనుక ఉన్న బసవయ్యపాళెం చెరువులో ఇటీవల కొందరు ప్లాట్లు వేసి ఎంచక్కా విక్రయించేశారు. ఇక్కడి చెరువు ఇప్పటికే ఆక్రమణలకు గురైంది. ఇక రోడ్డు పక్కనే ఉన్న చాకలిమాన్యం సర్వేనంబర్ 77/14లో 0.15సెంట్లు ఉండగా రోడ్డు విస్తరణలో భాగంగా అధికారికంగా 5సెంట్లు, అనధికారికంగా మరో రెండు సెంట్లు రోడ్డుకు విస్తరించారు. దీనిపై పలుమార్లు చాకలిమాన్యం చూపాలని తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన కొత్త తహశీల్దార్‌లు, డిప్యూటీ తహశీల్దార్‌లు, కలెక్టర్‌లకు నాయకులు వినతి పత్రం ఇచ్చినా సంబంధిత రజకసంఘ నాయకులు కాపాడుకోలేకపోయారు. ఈ చాకలిమాన్యంకు 1978లోనే డాక్యుమెంట్లు సృష్టించగా ఇటీవల పనిచేసి ఎసిబి దాడుల్లో సస్పెండైన ఓ తహశీల్దార్ విఆర్ఓ సహకారంతో ఈ భూమికి ఎంచక్కా పట్టాలిచ్చేసి తన జేబులు నింపుకున్నాడు. తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయంపై ఎసిబి అధికారులు, మరోవైపు విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టినా ఇక్కడ పనిచేస్తున్న విఆర్ఓలు ఏమాత్రం బయటపడడం లేదు. తమకేమీకాదులే అన్నదీమాతో ఇక్కడి విఆర్ఓలు ఎంచక్కా పనిచేసేస్తున్నారు. ఇక ఇదే మార్గంలో ఉన్న కల్లాంమిట్ట కోట్ల విలువైన భూమిని కూడా ఎంచక్కా గతంలో ఉన్న అధికారులు ఇతరులమీద పట్టాలు చేసేసి వెంచర్లువేసి విక్రయించేశారు. ఇక సర్వే నంబర్ 52 పక్కనే ఉన్న కాలువ పోరంబోకు భూమిపై కబ్జాదారుల కన్నుపడింది. దీంతో కోట్లు విలువచేసే కాలువపోరంబోకు భూమిపై కబ్జాదారుల కన్నుపడింది. దీంతో ప్రస్తుతం అక్కడక్కడా అక్రమణలు చేసి ఎంచక్కా విక్రయించేస్తున్నారు. ఇదికాకుండా తహశీల్దార్ కార్యాలయంకు సమీపంలోని చిలకమహాలక్ష్మి గుడిపక్కనే ఉన్న డంపింగ్‌యార్డులో కొంత స్థలం ఆక్రమణలకు గురైంది. దీన్ని కొందరు ప్లాట్లు వేసేందుకు రంగం సిద్ధంచేశారు. ఇక బసవయ్యపాళెం చెరువు ఎదురుగా ఉన్న కాలువను పూడ్చివేసి వెంచర్లు వేసేందుకు సిద్ధంచేశారు. ఆక్రమణల విషయమై తహశీల్దార్‌ను వివరణకోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

## సర్కారు ఉచిత బియ్యానికి భలే గిరాకీ..!

**-కేజీ రూ॥20 చొప్పున కొనుగోలుచేస్తున్న వైనం**

**-పేదల నోట్లో మట్టి..!!**



సత్యవేడు, జులై 21, ప్రభాతవార్త:

సర్కారు ఉచిత బియ్యం సరఫరా పై సత్యవేడు మండలంలో పర్యవేక్షణ లోపించింది. చౌకదుకాణాలు, ఇంటింటికే బియ్యం ద్వారా పేదలకు అందించే ఉచితబియ్యం పక్కదారి పడుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బియ్యం అక్రమ రవాణా వ్యాపారదారులకు సిరుల వర్షం కురుస్తోంది. సూళ్ళూరుపేట, తడ ప్రాంతాల్లోని కొందరు ఉచిత బియ్యాన్ని కొనుగోలు చేస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారు. కొందరు డీలర్లు, వాహనాల ద్వారా బియ్యం సరఫరా చేసేవారు కార్డు దారులకు బియ్యంకు బదులుగా కేజీ కి రూ॥5 లు చొప్పున డబ్బులు ఇచ్చి బియ్యం తమ వద్దనే ఉంచుకుని బియ్యం అక్రమ రవాణా వ్యాపారదారులకు కేజీ రూ॥20 లు లెక్కన విక్రయించి లాభాలు గడిస్తున్నారు. అక్రమ బియ్యం రవాణా వ్యాపార దారులు కొనుగోలు చేసిన సర్కారీ ఉచిత బియ్యాన్ని హోటల్స్‌కు, ఇతర రాష్ట్రాలకు కేజీ రూ॥60 లకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం. దీంతో సర్కారు ఉచిత బియ్యానికి భలే గిరాకీ పలుకుతుండగా, క్షేత్రస్థాయిలో పేదల నోట్లోమట్టి గొట్టి పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న పరిస్థితులు శోచనీయంగా ఉన్నాయి. మండలంలోని తమిళనాడుకు సరిహద్దు గ్రామీణ ప్రాంతాలు పేరడం, రాజగుంట, కన్నావరం, అల్లప్పగుంట, వెంకటరాజుల కండ్రిగ, ఆరూరులో ఉచితబియ్యం సేకరణ, అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు. నిత్యవసర వస్తువుల సరఫరాపై సుమారు ఆరుమాసాలుగా చిన్నపాటి తనిఖీకూడా లేకపోవడం ఆశ్చర్యం కలిగించే అంశంగా ఉంది. ఏమేరకు సంబంధిత అధికారులు పేదల ఉచిత బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటారో వేచి చూడాల్సి ఉందని ప్రజలు భావిస్తున్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

**బంగారుపాళ్యం, జులై 21 ప్రభాతవార్త:**

అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వైకాపా ప్రభుత్వం విధులు నిర్వహిస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం పాలేరు సచివాలయ పరిధిలోని మొగిలి వెంకటగిరి, నేతాజీనగర్, దళితవాడ, శేషాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబు ప్రతి గడపకు వెళ్ళి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరించారు. జగనన్న చేపట్టిన పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను దగ్గరగా చూశారని పేర్కొన్నారు. అనంతరం అధికారం చేపట్టాక ప్రజల కష్టాలను తీర్చడం కోసం నవరత్నాలను జగనన్న తీసుకువచ్చారని పేర్కొన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంకను అర్హత వుండి లబ్ది చేకూరని వారికి లబ్ది కలిగేలా చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. అనంతరం తగ్గువారిపల్లి జగనన్న కాలనీ లబ్దిదారులకు ఎమ్మెల్యే ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ సమితి ఉపాధ్యక్షుడు తులసీరామకృష్ణారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఎంపిడిఓ మధుసూధన్‌రెడ్డి, తహసిల్దారు బెన్నురాజ్, సర్పంచ్‌లు దీప్తిరెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు, వైకాపా నాయకులు కిషోర్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, జగదీష్, మహేంద్ర, రఘుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## 55లీటర్ల నాటుసారా స్వాధీనం

**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త**



మండలంలోని బ్రహ్మదేవర చేన్లు గ్రామంలో శుక్రవారం సాయంత్రం సెబ్ అధికారులు మెరుపుదాడి నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో 55 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని మంజుల అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సిఐ కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై రామూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధురాలు మృతి.. చంద్రబాబు తరపున ఆర్థికసాయం

**కుప్పంరూరల్, జూలై 21 ప్రభాతవార్త**



మండలంలోని పైపాళ్యం పంచాయతీ తంగేడుకుప్పంకు చెందిన వృద్ధురాలు కమలమ్మ (75) మృతి చెందింది. ఈమె మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబునాయుడు సంతాపం వ్యక్తం చేశారు. యూనిట్ ఇన్‌చార్జ్ వల్లెప్ప, మాజీ ఎంపిటిసి తొట్ల మణి, సమన్వయ కమిటీ సభ్యుడు చెక్కునత్తం మణి, విఎస్ఎస్ ఛైర్మన్ కనకరాజ్, భరణి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. అధినేత చంద్రబాబు తరపున బాధిత కుటుంబానికి పదివేల సాయంను అందించారు.

## కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, జూలై 21 ప్రభాతవార్త**



కుప్పం నియోజకవర్గ అభివృద్ధి మాజీ సిఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమయిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం శాంతిపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ప్రతిరోజూ కుప్పంకు వచ్చిన మంత్రికి కుప్పంలో జాతీయ రహదారి, గ్రామాల్లో సిసి రోడ్లు కన్పించలేదా అని ప్రశ్నించారు. కనీసం ఎన్టీఆర్ సుజల పథకంలో ప్రజలకు తాగునీరు అందించే స్థితిలో వైకాపా లేదన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు ఫోటోలు, పేర్లు మార్చినా నీరు మాత్రం అందడం లేదన్నారు. కుప్పంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి సభలో 66కోట్లు ఇస్తారని చెప్పారని అయితే చంద్రబాబు నాయుడు 100కోట్లు గతంలో మంజూరు చేయగా ఆ నగదులోనే 66కోట్లు వేశారన్నారు. ఎన్టీఆర్ అందించిన 35రూ.ల పెన్షన్‌ను చంద్రబాబు 75చేస్తే వైఎస్ వెయ్యి రూపాయలు పెంచారని మరలా చంద్రబాబు రెండువేలకు పింఛన్ పెంచారన్నారు. 3వేల పింఛన్ ఇస్తామన్న సిఎం జగన్‌రెడ్డి నాలుగేళ్ల గడచినా మూడువేలు ఇవ్వలేదన్నారు. హంద్రీనీవా పనులను శంకుస్థాపన చేసింది ఎన్టీఆర్ అని అనంతరం చంద్రబాబు 563కోట్లతో 90శాతం పనులు పూర్తి చేశారన్నారు. పదిశాతం పనులు నాలుగేళ్లలో పూర్తి చేయలేదన్నారు. స్థానిక సిరికల్చర్ భవనాన్ని మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు వినియోగించుకుంటున్నారన్నారు. అడవి పొరంబోకు భూముల్లో గ్రానైట్ దోచుకుంది ఎవరో అందరికీ తెలుసన్నారు. ఇసుకను వైకాపా నేతలు దోచుకుంటున్నారన్నారు. బిసిలకు ప్రాధాన్యత ఇచ్చింది వైకాపా నేతలు చంకలు గుద్దుకుంటున్నారని తాను బిసి అని తనకు చంద్రబాబు ఎమ్మెల్సీ కేటాయించారన్నారు. చంద్రబాబుకు కుప్పంలో లక్ష మెజార్టీ సాధిస్తామన్నారు. వైకాపా పాలనలో కార్పోరేషన్లు నిర్వీర్యం చేశారన్నారు. . కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, మణి, ఉయ్యాలజయరాంరెడ్డి, గోపాల్, నాగరాజు, చంద్ర పాల్గొన్నారు.

## సమస్యల సాధనకోసం విఆర్‌ఏల దర్నా

**పెద్దపంజాణి జూలై 21 ప్రభాతవార్త :**



వివిధ సమస్యల సాధన కోసం గ్రామరెవిన్యూ సహాయకులు శుక్రవారం దర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ అర్హులైన విఆర్‌ఏలను విఆర్‌ఓలుగా, అటెండర్లుగా, వాచ్‌మేన్‌లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పే స్కేల్ అమలు చేయాలని, అలాగే నామినీ విఆర్‌ఏలుగా పనిచేస్తున్న విఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని కోరారు. డిఏతో కూడిన వేతనాలను అందించాలని పే స్కేల్ ప్రకారం విఆర్‌ఏలకు 26వేల రూపాయల జీతాన్ని ప్రభుత్వం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.వి.వెంకటస్వామి, ఎన్.వెంకటరమణ, పి.సుబ్రమణ్యం, గిరిజమ్మ, టి.క్రిష్ణప్ప, టి.చెంగప్ప, టి.నాగరాజు. ఎస్.అన్వర్‌సాబ్, తలారి మునివెంకటప్పతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రప్రభుత్వం విద్యకు పెద్దపీట

ఎంఇఓ విజయ్‌కుమార్

**కార్వేటినగరం, జూలై 21 ప్రభాతవార్త:**



విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగడానికి రాష్ట్రప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఎంఇఓ విజయ్‌కుమార్ తెలిపారు. కార్వేటినగరం మండలం డి.ఎం.పురం ఉన్నత పాఠశాలలో ఆయన ప్రసంగించారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వం కోట్లరూపాయిలు వెచ్చించి కార్పొరేట్ స్కూళ్ళకు ధీటుగా భవనాలు, మరుగుదొడ్లు నాణ్యతగా ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థుల కోసం ఎన్నో వసతులను కల్పిస్తున్నారన్నారు. మరుగుదొడ్లను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంతటి పేదరిక కుటుంబానికైనా వెలుగు నింపేది విద్యమాత్రమేనని విద్యమాత్రమేనని ఎఇ నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కేశవులు, ఉపాధ్యాయుడు రంజిత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌ను సన్మానించిన గ్రామస్థులు

**కార్వేటినగరం, జూలై 21 ప్రభాతవార్త:**




కార్వేటినగరం మండలం సూరయ్యపాళ్యం మండల ప్రాథమికపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ బదిలీపై వెళ్ళుతున్న సంధర్భంగా గ్రామస్థులు, ఉపాధ్యాయుల సంఘాలు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ దంపతులను ఉపాధ్యాయ సంఘాలు, పాఠశాల కమిటీ ఛైర్మన్ శివయ్య శాలువలతో, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ శివయ్య మాట్లాడుతూ గత పదిసంవత్సరాలుగా ఈ పాఠశాలలో పిల్లలకు మెరుగైన విద్యఅందిస్తూ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, అంతేకాకుండా మారుమూల గ్రామమైన మా పాఠశాలకు కాంపౌండ్‌వాల్, నాడు-నేడు ద్వారా పనులను అధికారులతో మాట్లాడి ప్రత్యేక చొరవ చూపించి పాఠశాలను అభివృద్ధి చేశారని ఆయన సేవలు మరవలేనిదని కొనియాడారు. అనంతరం ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టీచర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ గ్రామంలో పనిచేయడం చాలా సంతోషంగా గడిపానని, గ్రామంలోని పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెరుగైన విద్య అందించడం వల్ల భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి విద్యార్థులు వెళ్ళుతారని తెలిపారు. నూతనంగా వచ్చిన ఉపాధ్యాయురాలు లత కూడా పిల్లలకు మంచి విద్యను అందేచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయసంఘ నాయకులు గోవిందయ్య, హేమచంద్రారెడ్డి, చలపతిరావు, కానిక్‌రాజ్, యువరాజు, అమర్ నాథ్, మోహన్‌మురళి, కార్తికేయులు, నాగేంద్రరాజు, పురుషోత్తం, వాసు, మిత్రబృందం సురేష్‌బాబు, గ్రామస్థ లు, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

**పాలసముద్రం, జూలై 21 ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంను క్షేత్ర స్థాయిలో పాదర్శకంగా చేపట్టి పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని తహసిల్దారు బాబు పేర్కొన్నారు. తహసిల్దారు కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల జాబితా సవరణపై శుక్రవారం రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో తహసిల్దారు బాబు నిర్వహించారు. ఈ సమావేశంలో తహసిల్దారు బాబు మాట్లాడుతూ బిఎల్‌ఓలు రాజకీయ పార్టీల బిఎల్‌ఎలతో కలిసి క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్ళి ఓటర్లను కలిసి అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు అనర్హులైన వారిని ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగిస్తారన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో వాలంటీర్లను దూరంగా పెట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు తహసిల్దారును కోరారు. అలాగే తమిళనాడు రాష్ట్రంకు చెందిన వారి ఓట్లు ఎక్కువగా మండలంలో వున్నాయని వాటిని పక్కాగా తొలగించడానికి చర్యలు తీసుకోవాలని దేశం నాయకులు తహసిల్దారును కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అరగొండలో కొనసాగుతున్న దోమల నివారణ చర్యలు

**తవణంపల్లె, జూలై 21 ప్రభాతవార్త:**



మండలంలోని అరగొండ మేజర్ గ్రామ పంచాయతీ అరగొండలో దోమల నివారణ చర్యలు శుక్రవారం కూడా నిర్వహించారు. మండలంలోని అరగొండ, బిసీ కాలనీ, సరకల్లు, నల్లిశెట్టిపల్లె, తవణంపల్లె గ్రామాలలో ఈనెల 17,18 తేదీల్లో ఐదు డెంగ్యూ వ్యాధి కేసులు నమోదైన విషయం విధితమే. ఈనేపథ్యంలో అరగొండలో గ్రామ పంచాయతీ సర్పంచ్ టి.మల్లుదొరై ప్రశాంత్‌కుమార్ ఆధ్వ ర్యంలో పారిశుద్య సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం పాగింగ్ నిర్వహించగా శుక్రవారం మురుగునీటి కాలువలు, కుంటల్లో ఆయిల్ బాల్‌లనువేసి లార్వా నిర్మూలన చర్యలు చేపట్టారు. ఈకార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అలరించిన 'సుభద్రకళ్యాణం'

**తవణంపల్లె, జూలై 21 ప్రభాతవార్త:**



మండలంలోని దిగువమాఘంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరిగిన 'సుభద్రకళ్యాణం' హరికథ కాలక్షేపం భక్తులను విశేషంగా అలరించింది. గ్రామంలోని బహుదానది ఒడ్డున వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ధర్మకర్త ఆర్.ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచం ద్రనాయుడుల సహకారంతో గ్రామస్థులు ఈనెల 6న మహాభారత యజ్ఞం కార్యక్రమం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఈమేరకు మునిలక్ష్మీ భాగవతారిణీచే ప్రతిరోజూ పగలు హరికథ కాలక్షేపం కార ్యక్రమాలను జరుగుతున్నాయి. ఈమేరకు శుక్రవారం జరిగిన సుభద్రకళ్యాణం హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా అలరించింది. ఈసందర్భంగా హరికథా కాలక్షేపం కార ్యక్రమంకు హాజరైన భక్తులు భక్తి శ్రద్దలతో ద్రౌపది అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో నిర్వహకులు మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు పరిష్కరించడానికే జగనన్న సురక్ష

-జెడ్పీటీసీ సుష్మాకీర్తి

**పెద్దపంజాణి జూలై 21 ప్రభాతవార్త :**



ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని పేదప్రజల సమస్యలను పూర్తిగా పరిష్కరించడానికే "జగనన్న సురక్ష" కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు జెడ్పీటీ సీ సుష్మాకీర్తి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దపంజాణి మండలకేంద్రంలోని సచివాలయ పరిధిలో సర్పంచ్ అఖిలాజాఫర్ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా పలువురు లబ్దిదారులకు 491 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం మండల కన్వీనర్ బాగారెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ..జగన్న ప్రభుత్వం జనం ప్రభుత్వమని ఏ కొంతమందికో ప్రభుత్వపథకాలు కాక అర్హులైన ప్రతి పేదకుటుంబానికి సంక్షమపథకాలను అందించడమే లక్ష్యంగా వైకాపా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత టిడిపీ పాలనలో సంక్షేమ పథకాలు ఎవరికైనా కావాలంటే జన్మభూమి కమిటీలను ఆశ్రయించాలని దేశం నేతల ఆశీర్వాదం ఉంటేతప్ప పథకాలు అందేవికాదన్నారు. నేడు ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి, ఎంపిడిఓ భాస్కర్, తహశీల్దార్ లోకేశ్వర్‌రావ్, సింగిల్‌విండో ఛైర్మన్ సంపల్లి బాబు, వైస్ ఎంపిపి జి.డి.బాబు, వైకాపా సోషల్ మీడియా మండల కన్వీనర్ బాలాజీ, ఎంపిటిసీ శ్రీనివాసులు. సర్పంచుల సంఘం అధ్యక్షులు హరినాథ్, నేతలు సతీష్ రెడ్డి, మహదేవ రెడ్డి, అబ్బాస్, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పంచాయతీలపై సురక్ష భారం

సర్పంచుల ఆవేదన

**కోటజులై 21 ప్రభాతవార్త**

ప్రభుత్వం పంచాయతీలపై చిన్న చూపు చూస్తోంది. తక్కువ నిధులు విడుదల చేస్తోంది. వాస్తవ ఖర్చులకు ప్రభుత్వం విడుదల చేసే నిధులకు సగం వ్యత్యాసం ఉంటోంది. ఇప్పటికే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతుండగా ప్రస్తుతం జగన్నన సురక్ష కార్యక్రమం అమలు మరింత భారంగా మారిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం పట్టణాలకు ఒకలా ..పల్లెకు మరోలా నిధులు కేటాయిస్తుంది. పట్టణాల్లో ఐదు సచివాలయాలు కలిపి ఒక చోట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వార్డు సచివాలయాలకు రూ 25 వేలు పల్లెల్లో సచివాలయాలకు రూ 15 వేలు చొప్పున మంజూరు చేస్తోంది. వీటిని సచివాలయాలకు సంబంధించిన ఈ సర్వీస్ ఖాతాకు జమ చేస్తామని చెప్పడం ద్వారా ప్రభుత్వ చిత్త శుద్ధి బయటపడిందిని సర్పంచులు అంటున్నారు. అల్పాహారం, ,భోజనలకు రూ10 నుంచి 15 వేలు, టెంట్లు, కుర్చీలు, బల్లలు, ప్లెక్సీలు, మైక్, వేదిక, అలంకరణ,, ప్రజా ప్రతినిధులు అధికారులకు అందజేసే పుష్పగుచ్చాలు, తదితర ఖర్చులకు రూ 20 వేలు ఖర్చు అవుతుందని సర్పంచులు చెబుతున్నారు. మొత్తం మీద రూ 30 వేల వరకు ఖర్చు అవుతోందని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు మంజూరు చేస్తోన్న ఆర్దిక సంఘం నిధులను విద్యుత్తు బకాయిలకు దారి మళ్లిస్తోందన్నారు. పంచాతీలకు స్టాప్ డ్యూటీ ,వృత్తిపన్ను, జనాభా గ్రాంటు సీనరేజీ సొమ్ము సర్దుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జగనన్న సురక్ష నిర్వహణ ఖర్చు పెనుభారంగా మారుతోందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సొంత సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తుందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎంపిడిఓ వివరణ:** జగనన్న సురక్ష కార్యక్రమానిక ప్రభుత్వం రూ 15 వేలు మంజూరు చేస్తోందని ఎంపిడివో మారెళ్ల భవాని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు అయినందన సర్పంచులు సర్దుకోవాలని చెప్పారు. ఈసొమ్మును ఈ సర్వీస్ ఖాతాలకు జమ చేయడం జరుగుతందన్నారు.

## జగనన్న సురక్షను అందరూ సద్వినియోగం చేసుకోండి

- ఎంపిపి కొళవి రఘు

**తడ, జులై 21 ప్రభాతవార్త**




జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తడ మండల పరిషత్ అధ్యక్షుడు కొళవి రఘురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తడకండ్రిగలోని రెండు గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన అధికారులతో కలిసి మాట్లాడుతూ గ్రామస్థులకు ఈ పథకం లక్ష్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో ప్రత్యేకించి మాట్లాడారు. తహశీల్దార్ కటారి జయజయరావు, ఎంపిడిఓ ఆమోస్‌బాబు, సర్పంచ్ తుమ్మా జయప్రద, ఇఓపిఆర్‌డి శేషారావు, డిప్యూటీ తహశీల్దార్ శరత్, గృహ నిర్మాణశాఖ ఏఇ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, కుసుమ, ఉప సర్పంచ్ అఫ్రిది, కోఆప్షన్ మెంబర్ హుస్సేన్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సభకు తరలివెళ్లిన వైకాపా నాయకులు

**కోట, జులై 21 ప్రభాతవార్త**



వెంకటగిరిలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభకు కోట మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వేళ్లారు. ప్రతి పంచాయతీ నుంచి బస్సుల్లో ఏంతో ఉత్సాహంగా వెంకటగిరికి చేరుకున్నారు. కొడవలూరు ధనజం యరెడ్డి, ఆధ్వర్యంలో ఊనుగుంటపాళెం, మద్దాలి, మద్దాలి కండ్రిగ, రుద్రవరం, చంద్రశేఖపురం, గూడలి గ్రామాల నుంచి వేళ్లాగా చెందోడు నుంచి సర్పంచ్ దేవారెడ్డి నాగుర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపాళెం నుంచి నేదురుమల్లి హరిచంద్రారెడ్డి, కేశవరం నుంచి చిట్టేడు మాజీ సొసైటి ఛైర్మెన్ ఉలవకాయాల ప్రసాద్, గురుస్వామి ఆధ్వర్యంలో విగ్రహాల రఘురామయ్య, ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బయ్యలు వేళ్లారు. కొక్కుపాడు నుంచి మండల వైకాపా కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, ఆధ్వర్యంలో వెంకటగిరికి చేరుకుని బహిరంగ సభతో పాటు అక్కడ దివంగత డాక్టర్, మాజీ సిఎం నేదురుమల్లి జనార్దన్ రెడ్డి కాంస్య విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన సాయిప్రసాద్‌రెడ్డి

**కోట, జులై 21 ప్రభాతవార్త**



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో కోట మండలం విద్యానగర్ చెందిన గూడూరు డివిజన్ వైకాపా యువ నాయకుడు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి కలిశారు. పుష్ప గుచ్చాన్ని అందచేశారు. ఈసందర్భంగా సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మగ్గానికి మహర్దశ తీసుకొచ్చి దేశంలో ఎక్కడ లేని విధంగా నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏటా వైస్సార్ నేతన్న నేస్తం కింది సాయాన్ని అందిస్తోందని చెప్పారు.

## దామానెల్లూరులో జగనన్న సురక్ష

**సూళ్లూరుపేట, జూలై 21 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట మండలం దామానెల్లూరు సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల సేవలను అందించి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేందుకు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రభుత్వ పథకాలను అందరికీ అందజేయాలన్న లక్ష్యంతోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సంక్షేమంతో పాటు ప్రభుత్వ పథకాల వివరాలు ఎంతవరకు లబ్ధిపొందుతున్నారని వివరాలు అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.రవికుమార్, ఎంపిడిఓ ప్రమీలరాణి, ఎంపిటిసిఎన్. రాజేశ్వరి, పంచాయతీకార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి పర్యటనకు తరలిన ప్రజలు

**దొరవారిసత్రం, జులై 21 ప్రభాతవార్త**



వెంకటగిరిలో నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు దొరవారిసత్రం మండలం నుంచి ప్రజలు తరలి వెళ్లారు. వైఎస్సార్ నేతన్న నేస్తం నిధులు విడుదల సందర్భంగా వెంకటగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు దొరవారిసత్రం నుంచి నాలుగు బస్సులు, కార్లు, బైక్‌లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. సుమారు వెయ్యిమంది వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు వెళ్లినట్లు నాయకులు తెలిపారు. తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎపిఎం పద్మావతి ఆధ్వర్యంలో నాలుగు బస్సులలో పోలిరెడ్డిపాలెం, వేణుంబాక, ఏకొల్లు, నెలబల్లి గ్రామాల నుంచి పొదుపు మహిళలను తీసుకెళ్లారు.

## కొత్తపాలెంలో జగనన్న సురక్ష

**కోట, జులై 21 ప్రభాతవార్త**

కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ మారెళ్ల భవాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకపోతే అటువంటి వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి వారికి కూడా పథకాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. అంతకుముందు కోటలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి పాల్గొన్నారు. ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## ముత్యాలమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

**చిల్లకూరు, జులై 21, ప్రభాతవార్త**



మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసియున్న శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో శుక్రవారం 65 రోజులకు హుండీ లెక్కంపు నిర్వహించగా 18 లక్షల 64 వేల 663 రూపాయిలు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దారెడ్డి ఇంద్రసేనా రెడ్డి, ఇఓ కె. నవీన్ కుమార్, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన నేదురుమల్లి హరిచంద్రారెడ్డి

**కోట, జులై 21, ప్రభాతవార్త**



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కోట మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాల్యెంకు చెందిన వైకాపా యువ నాయకు లు జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. జగనన్న నేతన్న నేస్తం కార్యక్రమానికి ముఖ్య మంత్రి హాజరుకావడంతో ఆకార్యక్రమంలో భాగంగా నేదుమల్లి రాంకుమార్‌రెడ్డి నేదురు మల్లి హరిచంద్రారెడ్డిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పరిచయం చేసారు.

## సిఎం సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

ఆర్డీవో కిరణ్ కుమార్

**గూడూరు, జులై 21, ప్రభాతవార్త**

వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ప్రకటించిన సంక్షేమ క్యాలెండర్‌లో భాగమైన 5వ విడత నేతన్న నేస్తం నిధులను 24 వేల రూపాయిలు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారుల ఖాతాలో నేరుగా విడుదల చేసేందుకు శుక్రవారం వెంకటగిరిలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభను విజయవంతం చేసిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆర్డీవో కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణం ఏర్పాట్లను గత పది రోజులు నుండి డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు రాత్రి పగలు తేడా లేకుండా బాధ్యతగా తీసుకుని తనకు సహకరించి విజయవంతం చేసిన వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆర్డీవో పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన గూడూరు ఆర్డీవో

**గూడూరు, జులై 21, ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా వెంకటగిరిలో నేతన్న నేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన సిఎం జగన్‌మోహన్ రెడ్డిని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆర్డీవో చేస్తున్న సేవలను అభినందిస్తూ ఇంకా మరెన్నో సేవలు ప్రజలకు చేయాలని సూచించారు.

## చెరువు ఆక్రమణపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు

**శాంతిపురం, జులై 21 ప్రభాతవార్త**

మండలంలోని సోగడబళ్ల పెద్ద చెరువు ఆక్రమణకు గురవుతోందని ఈవిషయంగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ గోపాల్ జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. అలాగే సోగడబళ్ల చిన్న చెరువులో అక్రమంగా తుమ్మ చెట్లు కొట్ట తరలిస్తున్నారని దాన్ని నిలుపుదల చేయాలని కోరారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల ధర్నా

**వి.కోట, జులై 21 ప్రభాతవార్త**



తమ డిమాండ్ల సాధన కోసం వి.కోటలో గ్రామ రెవెన్యూ సహాయకులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అరు ్హలైన విఆర్‌ఎలకు విఆర్వోలు, అటెండర్లు, వాచ్‌మెన్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే నామినీ విఆర్‌ఎలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐద్వా కో కన్వీనర్ జీవిత, సిఐటియు నేతలు అనిత, శ్యామల, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించాలి - జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త**

కుప్పం నియోజకవర్గంలో వివిధ సమస్యలపై వచ్చిన స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. గత నెల 7వతేదీ కుప్పంలో నియోజకవర్గ స్థాయిలో స్పందన కార్యక్రమం చేపట్టామని జెసి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగు మండలాలనుంచి దాదాపు 150 వినతిపత్రాలను అందించారని జెసి తెలిపారు. కుప్పం మండలంనుంచి అధికంగా 70దాకా వినతులు అందాయన్నారు. ఈ వినతులకు సంబంధించి ఆయా మండలాల్లో ఏమేర సమస్యలు పరిష్కరించారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా ప్రజలనుంచి వచ్చిన వినతులు స్వీకరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. అనంతరం తమ డిమాండ్లు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆనంద్ యాదవ్ అధ్వర ్యంలో విఆర్‌ఎలు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు పార్వతి, గుర్రప్ప, మురళి, నరసింహులు, ఉప తహశీల్దార్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఇంత ఆలస్యంగా పని చేస్తే ఎలా?

-సిసి కెమెరాలను ఏర్పాటు చేయండి
-డిపో మేనేజర్కు బిజెపి వినతి



శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఆర్టిసి డిపోలో రోజు రోజుకు దొంగతనాలు పెచ్చుపెరిగి పోతున్నాయని ఆకతాయిల ఆగడాలు శృతి మించుతున్నాయని బిజెపి డిపో మేనేజర్కు ఫిర్యాదు చేసారు.ఇక్కడ సిసి కెమెరాలు లేకపోవటంతో విచ్చల విడిగా మారిందన్నారు.ఆర్టిసి డిపో ఆవరణలోని స్టేషన్లో గత కొంత కాలంగా ప్రయాణీకుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఆకతాయిలు చెలరేగి ప్రయాణీకులను భయభ్రాంతుల్ని చేయటమే కాకుండా విలువైన వస్తువుల్ని తస్కరించటం,ఆభరణాలను తస్కరిస్తున్నారని డిపో మేనేజర్కు ఫిర్యాదు చేసారు.అయితే మేనేజర్ సిసి కెమెరాలున్నాయని కానీ అవి పని చేయటం లేదని త్వరలోనే వాటిని బాగు చేస్తామన్నారు.నెల్లూరు మార్గంలో ట్రాఫిక్ అత్యధికంగా ఉంటుంది.కానీ సర్వీసుల్లేనందువల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదు చేసారు.తిరుపతి వైపు వెళ్ళు నాన్స్టాప్ బస్సులను మిట్ట కండ్రిగ వద్ద ఆపాలని కోరారు.మంచినీటి వసతి, మరుగుదొడ్లనుఇ ంకా బాగుచేయాలని కోరారు.ఈకార్యక్రమాల్లో పట్టణ పార్టీ అధ్యక్షుడు గరికపాటి రమేష్బాబు,కొండేటి గోపాల్, మద్దు వాసుయాదవ్, పుణ్యం ఢిల్లీ,చెంగల్రాయరెడ్డి, కిరణ్మణి, అమర్నాథ్, బాలిశెట్టి చంద్ర,కన్నా వెంకటేశ్వర్లు,ఎల్గోపాల్,ఎల్ రమణ,పగడాలప్రతాప్,కలపాటిమోహన్రావు,శ్రీపురం సుధాకర్,కుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రవక్తలు ఆచరించిన విధానాలను ఆచరించాలి



రేహాన్

శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త

అల్లాహ్ సూచించిన మార్గాలను ప్రవక్తలు ఆచరించారని వారు ప్రశాంతంగా,సుఖ సంతోషాలతో కాలం గడిపారని అయితే నేడు మన మతం, సంప్రదాయం, సంస్కృతులను విస్మరిస్తున్నాము. అల్లాహ్ మార్గాలను విడనాడి కష్టాలు,కన్నీళ్ళు కొనితెచ్చుకుంటున్నామని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ అన్నారు. శుక్రవారం జామియా మస్జిద్లో ప్రత్యేక ప్రార్థనల తరువాత మాట్లాడుతూ నేడు మనం ఎటు పయనిస్తున్నామో ఒక సారి పరిశీలించుకోవాలన్నారు.మనం పాటించాల్సిన ఐదు సూత్రాల్లో ఏ ఒక్కటి కూడా ఆచరించలేని దుస్థితిలో జీవితం గడుపుతూ స్వర్గస్తులం కావాలంటే సాధ్యమా? అని ప్రశ్నించారు. మసీదులను మరచిపోతున్నాము.నమాజులను ఆచరించే సమయం లేదు.సంప్రదాయ విద్యకు స్వస్తి చెబుతున్నాము. మన ప్రవక్తలు ఆచరించిన విధానాల గురించి అసలే తెలియదు. ఇలాగే కొనసాగితే కొంత కాలం తరువాత మరో జనరేషన్కు ఇస్లాం అంటేనే తెలియదని,మసీదుల కనబడవన్నారు. మనం మారాలి. భావి తరాలకు మన ప్రవక్తలు ఆచరించిన విధానాలను తెలియాలంటే మనం తరచూ 'దివ్యఖుర్ ఆన్' చదవాలి.చదివించాలి.అరబ్బీ రాకుంటే నేర్చుకోవాలని రేహాన్ పిలుపు నిచ్చారు.మనం అల్లాహ్ సూచించిన ఏ సూత్రాన్ని ఆదేశాలను పాటించక సకల సుఖాలను కోరుకోవటం అత్యాస అన్నారు.

## జగనన్న సురక్షతో ఉచితంగా ఇంటికి సర్టిఫికేట్లు



బియ్యపు గోవిందరెడ్డి

శ్రీకాళహస్తిరూరల్,జూలై 21 ప్రభాతవార్త

రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి ఆచరించని పథకాలను జగన్మోహన్రెడ్డి ఆచరిస్తూ ప్రజలకు చేరువౌతున్నారని బియ్యపు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణ పురం గ్రామంలో జగన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. మొదటి సారి శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి తండ్రి బియ్యపు గోవిందరెడ్డి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ గ్రామంలో 634మందికి 11 రకాల ధృవీకరణ పత్రాలను అందించారు.అలాగే ఆధార్సేవలు 131 మందికి అందించారు.ఈకార్యక్రమాలకు ఎంపిడిఓ రఫీఖాన్ అధ్యక్షత వహించగా మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి,గోపిగౌడ్, గుంటకింద పల్లి సర్పంచ్ పెంచులమ్మ,సచివాలయ కన్వీనర్లు మునికృష్ణయ్య, పసల కృష్ణయ్యపంచాయతీ కార్యదర్శి ప్రకాష్, విఆర్ఓ ప్రేమ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం వస్తే మేమెందుకు హౌస్ అరెస్టు కావాలి?

శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి పర్యటనకు వస్తే మమ్ములలెందుకు హౌస్ అరెస్టు చేస్తారని జనసేన నాయకురాలు వినూత కోట పోలీసుల్ని ప్రశ్నించారు. శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి వెంకటగిరి పర్యటన సందర్భంగా జనసేన నాయకురాల్ని ఆమె కుటుంబ సభ్యులను హౌస్ అరెస్టు చేయటం ఏమిటని పోలీసుల్ని ప్రశ్నించారు. ఆమె ఇంటి వద్దకు వన్టౌన్ ఎస్ఐ తిమ్మయ్య వారి సహచరులతో వెళ్ళి హౌస్ అరెస్టు అని చెప్పగా వారు మేమైనా టెర్రరిస్టులా? తీవ్ర వాదులా అని ప్రశ్నించారు.మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేక నియంతృత్వంలో ఉన్నామా? అని పోలీసులను ప్రశ్నల వర్షంలో ముంచెత్తారు.జనం ఇలాంటి విధానాలను గమనిస్తున్నారని రాబోవు ఎన్నికల్లో నియంతృత్వంతో పరిపాలించాలనుకునే వారికి బుద్దిచెబుతారని వినూత,కోట, చంద్రబాబు కోట అన్నారు.

## వాసవి అమ్మవారికి మణి ద్వీప వర్ణన

శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం మణిద్వీప వర్ణన కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణానికిచెందిన ఆర్యవైశ్య మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తి పారవశ్యం కనబడింది.అధిక శ్రావణ మాసం సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తామని వివరించారు. ఇక్కడ వెలసిన అమ్మవారు నిత్య పూజలతో అభిషేకాలతో అలరారుతుంది.శుక్రవారం తొమ్మిది రకాల పూలు, గాజులతో మణిద్వీప వర్ణన పూజల్ని నిర్వహించారు. పట్టణంలోని 80కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.ఈ పూజలకు దేవాలయ పాలకమండలి,వాసవి మహిళా మండలి,వాసవి సేవకులు,వాసవి యువసేన ఏర్పాట్లును పర్యవేక్షించారు. మహిళా భక్తులకు సదుపాయాలు కల్పించారు.

## దళితుల భూముల జోలికొస్తే సహించేది లేదు



-పులిశ్రీకాంత్

శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త

ప్రభుత్వాలు మారినా పేదల తరాతలు మారడం లేదని దళితులకు ఇచ్చిన భూములు కర్పూర హరతుల్లా కరిగిపోతున్నాని జైభీం వ్యవస్థాపకులు మాజీ ఆర్మీ సైనికుడు పులిశ్రీకాంత్ ఓ ప్రకటలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గుంటకిందపల్లి పంచాయతీ మద్దిలేడు రోడ్డు పక్కనే ఉన్న సుమారు 5ఎకరాలు ఆన్లైన్లో పేర్లు మార్చడం జరిగిందని అర్హులైన దలితుల వద్ద అన్ని ఆధారాలున్నా పట్టించుకునే నాధుడే లేడన్నారు. గుంటకిందపల్లి పంచాయతీ సర్వేనంబర్8/3లో 2.98 సెంట్లు బత్తెయ్యకు 1996 సంవత్సరంలో డికెటి పట్టా పాసుపుస్తకం ఇచ్చారని అప్పటి నుంచి ఆస్తిని కాపాడుకుంటూ వస్తూ తన కుమారులు రాబోవు రోజుల్లో తమ పిల్లల భవిష్యత్తుకు అండగా నిలుస్తుందన్న తరుణంలో రెండు రోజుల క్రితం కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రి చదును చేసి అక్రమ కట్టడాలకు చర్యలు చేపట్టడంతో తెలుసుకున్న బాధితుడు సంబందిత రెవెన్యూ కార్యాలయానికి వెళ్ళి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. అయితే వీరు 2007లోనే మరో పేరుపై మారిందని చెప్పడంతో నిరుపేదలైన దళితులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అర్థం కాక లబోదిబోమంటున్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని బాధితులకు న్యాయం జరిగే వరకు సహించేది లేదని బాధితులకు అండగా దళిత సంఘాలు ఏకమవుతాయని తెలిపారు.

## శ్రీశ్రీశ్రీ గంగమ్మ జాతరకు తేదీలు ఖరారు

రేణిగుంట, జూలై 21 ప్రభాతవార్త:

చిత్తూరు, తిరుపతి ఉభయ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రేణిగుంట శ్రీశ్రీశ్రీ గంగమ్మజాతర ఆగస్టు 21,22,23 వైభవంగా నిర్వహిస్తామని రేణిగుంట గంగమ్మ ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్రెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆగస్టు 15వ తేదీ రాత్రి 12 గంటలకు జాతరకు చాటింపు వేయిస్తామని ధర్మకర్త మల్లికార్జున్రెడ్డి అన్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'దిశ' కమిటీ డైరెక్టర్గా బాల నియామకం

తిరుపతి ప్రెస్క్లబ్,జూలై 21 ప్రభాతవార్త:



జాతీయ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయితీ రాజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా తరపున నిర్వహించే 'దిశ' స్టేట్ కమిటీ డైరెక్టర్గా రేణిగుంటకు చెందిన పి.బాల ను నియమిస్తూ కేంద్ర రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయితీ రాజ్ శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కో-ఆర్డినేటరింగ్(దిశ) కమిటీ బాధ్యతలు వీరు నిర్వహించనున్నారు.ఈ కమిటీకి ఛైర్మన్గా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఉంటారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ అభివృద్ధి ఫలాలు ప్రాథమిక స్థాయిలో గ్రామీణ ప్రజలకు అందుతున్నాయా..లేవా అన్న విషయంపై వీరు అధికారులతో సమన్వయం చేసుకుని సమీక్షలు నిర్వహించి అర్హులైన వారికి అందించడం వీరి బాధ్యత.రూరల్ డెవలప్మెంట్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్,వాటర్ సప్లై,స్కూల్ ఎడ్యుకేషన్,అగ్రికల్చరల్ లేబర్ వెల్ఫేర్ స్కిల్ డెవలప్మెంట్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర సంక్షేమ అభివృద్ధి పథకాల తీరుతెన్నులపై అధికారులతో సమన్వయం చేసుకుని సమీక్ష నిర్వహించి అమలు చేయడం వీరి విధిలో ఓ భాగం.ఈయన దిశ కమిటీ డైరెక్టర్గా నియమితులు కావడం పట్ల ఆయన అభిమానులు,వైసిపి కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు.

## శ్మశానంలో క్రిమేషన్ షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నగరి, జూలై 21 ప్రభాతవార్త:



నగరి పట్టణ పరిధి కుశస్థలీనదిని ఆనుకుని ఉన్న శ్మశానానికి జనాభాకు తగిన రీతిన స్థలం లేకపోవడం, ఈ ప్రాంతానికి దహనానికి సరిపడ కొయ్యలు, ఇతర దహన సామగ్రి తెప్పించుకోవడం కష్టతరం కావడంతో దహన క్రియల సమయంలోస్థానికులకు పలు సమస్యలు ఎదురవుతోంది. ఈ సమస్య దశాబ్దాల తరబడి ఉన్నా నాయకులు సమస్య పరిష్కారానికి చొరవ చూపలేదు. ప్రస్తుతం మంత్రి రోజా ఈ సమస్యపై ప్రత్యేక చొరవ చూపారు. శ్మశానంతో క్రిమేషన్ షెడ్డు నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. తొలి విడతగా రూ.35 లక్షలు విడుదల చేయించి షెడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో క్రిమేషన్ షెడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ నరేష్లు మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. దీంతో కొన్ని దశాబ్ధాలుగా స్థానికులకు దహన క్రియల సందర్భంగా ఎదురైన సమస్య పరిష్కారమ వుతుందన్నారు.

## తొండవాడ "సత్యన్న " మృతి తీరనిలోటు

అశ్రు నయనాల నడుమ అంతిమ వీడ్కోలు

చంద్రగిరి, జూలై 21 ప్రభాతవార్త:



తొండవాడ సత్యన్న (తపసి సత్యనారాయణ రెడ్డి) మృతి తమకు తీరని లోటని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పులివర్తి నాని సతీమణి, టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ఆవేదన చెందారు. చంద్రగిరి మండలం, తొండవాడకు చెందిన సత్యనారాయణ రెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి 4 దశాబ్దాలుగా ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్నారు. గత కొన్నేళ్ళుగా ఆయన మదుమేహం, హృదో ్రగంతో భాధపడుతున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సల చేసుకున్నారు. అదేవిధంగా మదుమేహం కారణంగా కాలికి రెండు పర్యాయాలు శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. ఇటివంటి పరిస్థితులను సైతం ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని తనను నమ్ముకున్న ప్రజలకు దశాబ్దాలగా సేవలందిస్తున్నారు. గతంలో ప్రజలు ఆయన సేవలను గౌరవిస్తూ పంచాయతీ సర్పంచ్గా ఎన్నుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా చెక్కుచెదరని విశ్వాసంతో టిడిపిని విడిచిపోకుండా నిలబడ్డారు. 2019 ఎన్నికలలో టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగిన పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డిలతో చక్కటి అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారు. రెండు రోజుల క్రితం ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో కుటుంబ సభ్యులు బావమరిది, అల్లుడు అయిన పులికంటి మోహన్ రెడ్డి, కుమారుడు తపసి తిరుమల రెడ్డి హుటాహుటిన తిరుపతిలోని స్విమ్స్కు తరలించారు. రెండు రోజుల వైద్య చికిత్సలలో బుధవారం అర్ధరాత్రి తీవ్రమైన గుండెపోటుకు గురికావడంతో వైద్యులు మెరుగైన వైద్యం అందించే ప్రయత్నం చేసినప్పటికీ సఫలం కాలేకపోయారు. దీంతో గురువారం ఉదయం వైద్యులు ఆయన మృతిని ధృవీకరించారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలకు హాజరైన పులివర్తి సుధారెడ్డి కన్నీటి పర్యంతమవుతున్న కుమార్తె తేజోవతి, భార్య మల్లీశ్వరీ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. దహన క్రియలు పూర్తయినప్పటికీ దాదాపు రోజంతా ఆక్కడి కుటుంబ సభ్యులతో గడిపారు. పార్టీ నాయకుడుగా సత్యన్న సేవలు స్మరించుకున్న ఆమె పార్టీ పతాకాన్ని భౌతిక కాయం అలంకరించి నివాళులర్పించారు. గ్రామస్థులు, బంధుమిత్రులు, రాయకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున తరలిరాగా అశ్రునయనాల నడుమ తమ ఆత్మబంధువుకు కన్నీటి వీడ్కోలు పలికారు. స్వర్ణముఖీ నదిలో తపసి తిరుమల రెడ్డి తన తండ్రి దహన క్రియలను హిందూ ధర్మచారాలతో పూర్తి చేశారు.

## ఆలయ పునర్నిర్మాణానికి దాతల వితరణ

చంద్రగిరి, జూలై 21 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు తమ వంతు వితరణలతో సహకరిస్తున్నారు. ఈ మేరకు పిచ్చినాయుడుపల్లి గ్రామస్థులు అందించిన 1,55,016/-లు మొత్తాన్ని సర్పంచ్ భాస్కర్ రెడ్డి శుక్రవారం ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణా రెడ్డిలకు అందజేశారు. అదేవిధంగా ఐతేపల్లికి చెందిన చింతం మునిచంద్ర యాదవ్ కుమారుడు చింతం శ్రీకాంత్ రూ.1,00,116/-లు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## దొంగ ఓటర్లను గుర్తించేందుకే బిఎల్ఏలు ఏర్పాటు

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, జూలై 21 ప్రభాతవార్త:



నియోజకవర్గ పరిధిలో దొంగ ఓటర్లను గుర్తించేందుకే టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ పులివర్తి నాని బిఎల్ఏల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి నియమించిన బిఎల్ఏల జాబితాను తహశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సుమారు 25 వేల దొంగ ఓటర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసినట్లు ఆరోపించారు. ఇతర ప్రాంతాల నుండి ఓటర్లను జాబితాలో చేర్పించి ఎన్నికలలో అక్రమ పద్ధతిలో గెలుపొందాలని చూస్తున్నట్లు దుయ్యబట్టారు. ఎన్నికలు నిజాయితీగా, సజావుగా నిర్వహించేందుకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్ చదరి, రావిళ్ళ గిరి, కొల్లాగుంట మునిరామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, లెక్కల మహేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాలు

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

రామచంద్రాపురం, జూలై 21 ప్రభాతవార్త:



జీవించాలని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు రెడ్డి అన్నారు. శుక్రవారం నెత్తకుప్పం, పుల్లమ నాయుడు లలో జరుగుతున్న ఉచిత వైద్య శిబిరాలను ఆయన డుతూ ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచనల వైద్య చేయడం జరిగిందన్నారు. వైద్య శిబిరాలకు వచ్చే ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి వారికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు, సింగిల్విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, ఎంపిడిఓ మహ్మద్రఫీ, నెత్తకుప్పం డివిజినల్ అధ్యక్షుడు తాతిరెడ్డి వెంకటరెడ్డి, వైసిపి పంచాయతీ అధ్యక్షుడు సాయిశశికాంత్, కేశవులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్నదానం

చంద్రగిరి, జూలై 21 ప్రభాతవార్త:



సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి భక్తులకు బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్ ఛైర్మన్ బి.హితే ంద్రనాద్ రెడ్డి దంపతులు అన్నదానం జరిపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చంద్రగిరి గ్రామదేవతగా భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారి భక్తులకు అన్నదానం చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. చంద్రగిరి గ్రామదేవతగా కొలిచే అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం భక్తులకు దాతల ద్వారా అన్నదానం జరిపించేందుకు ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఆకలి తీర్చడం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. అంతకు ముందు అమ్మవారి దాతలకు, వారి కుటుంబ సభ్యులకు దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ హెచ్ఎం వేణుగోపాల్ రెడ్డి, టీచర్లు నిర్వహించారు.

## నవోదయ ప్రవేశ పరీక్షకై విశ్వంలో ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి (విద్య), జూలై 21, ప్రభాతవార్త

స్థానిక వరదరాజనగర్లోని విశ్వం టాలెంట్ స్కూల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు 2024 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో 20 జనవరి 2024లో జరగబోవు నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలియజేసారు. ఈ అవగాహన సదస్సుకు 4వ తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఈ పోటీ పరీక్ష వివరాలు, వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలుపుతూ పరీక్షలో సీట్లు పొందడానికి మెలుకువలను పద్ధతులను తెలుపబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9399976999, 8688888802 నెంబర్లకు సంప్రదించవచ్చునని తెలిపారు.

## జగనన్న సురక్షతో కుటుంబాలకు భద్రత-ఆస్తులకు ధృవీకరణ

శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాలతో నిరుపేద కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా సచివాలయాల ఇన్చార్జి తిరుకాల మల్లికార్జున్ గౌడ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలతో రాష్ట్రంలో 1.25కోట్ల కుటుంబాలు లబ్ధి పొందాయని తెలిపారు.ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం, ముఖ్యమంత్రి పని చేస్తున్నారని వివరించారు. శుక్రవారం 753 మంది లబ్దిదారులకు 702 సర్టిఫికేట్లను అందించారు.ఈకార్యక్రమాల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్సెపెక్టర్లు రవికాంత్,కన్వీనర్ వి.రమేష్, ఎస్.ఖలీల్బాషా,వి.వినుతలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం గెలుస్తుంది.. సమస్యలు పరిష్కరిస్తాం

రేణిగుంట, జూలై 21 ప్రభాతవార్త:



వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ దుందుభి మోగిస్తుందని సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి సతీమణి, శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి బొజ్జల సుధీర్రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ అన్నారు. ఇంటింటికి బొజ్జల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సుధీర్రెడ్డి సతీమణి రిషితరెడ్డి, మాతృమూర్తి బృందమ్మ కరకంబాడి పంచాయతీలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఆ ప్రాంత వాసులు ఎదురేకి వారికి స్వాగతం పలికారు. అందరిని పలకరిస్తూ తెలుగుదేశం పార్టీని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి బుజ్జినాయుడు, మాజీ మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరెడ్డి, చిన్నరెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ మహబూబ్ బాషా, యూనిట్ ఇన్చార్జి మునిరాజా, మునస్వామినాయుడు, బూత్ ఇన్చార్జి నాగేశ్వరరావు, భాస్కర్రెడ్డి, నాధమునిరెడ్డి, వెంకటరెడ్డి, చిన్నప్పరెడ్డి, వెంకటాద్రి, వెంకటరత్నం, మునయ్య, బాలాజీ, మునిరాజా, శ్రీనివాసులు, వాసు భాస్కర్రెడ్డి, స్వామి, నాయుడమ్మ, రాణెమ్మ, మునిరాజా నాయుడు, భాస్కర్రెడ్డి, మోహన్రావు, ప్రభాకర్ ఆచారి, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, నిలకంఠరెడ్డి, హరి, ఓబుల్రెడ్డి, గ్రామస్థులు కుమార్నాయుడు, నాగరాజు, కేశవులు, బాల సుబ్రహ్మణ్యం, షణ్ముగం, భరత్, చంద్ర, రమేష్, రాజేష్, యువరాజ్, చంద్రమ్మ, కృష్ణవేణి, శ్రీలక్ష్మి, సుమతి, అనిత, శాంతమ్మ, సంధ్య,సుభాషిణి, సుజాత, దాక్షాయణి, పద్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెప్కో బ్యాంక్ సువర్ణ అవకాశం

నేటి నుండి ప్రత్యేక డిపాజిట్ మేళాను సద్వినియోగం చేసుకోండి

నగర ప్రజలు, కస్టమర్లు, వ్యాపారస్తులకు విజ్ఞప్తి



తిరుపతి టౌన్, జూలై 21, ప్రభాతవార్త

భారత ప్రభుత్వ సంస్థలు అందిస్తున్న అవకాశంలో భాగంగా స్థానిక జీ కారు వీధిలోని రెప్కో బ్యాంక్ నగర ప్రజలకు, వ్యాపారస్తులకు, కస్టమర్లకు ఓ సువర్ణ అవకాశం ఇస్తుంది. నేటి నుండి ఆగష్టు 31వ తేది వరకు ప్రత్యేక డిపాజిట్ల మేళను నగర ప్రజలు వ్యాపారస్తులు, కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ పి. తెన్నావన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెప్కో బ్యాంక్ భారత ప్రభుత్వ సంస్థలు వారు అందిస్తున్న సువర్ణ అవకాశంలో ఫిక్సిట్ డిపాజిట్లుపై అత్యధిక వడ్డీ అందించనుం దన్నారు. నేటి నుండి ఆగష్టు 31వ తేది వరకు ప్రత్యేక డిపాజిట్ మేళాను ఆవిష్కరించపోతున్నా మని ఆయన తెలియజేసారు. ఈ స్కీములో వృద్ధులకు 400 రోజులకు గాను 8.25 శాతం ఇతరులకు 7.75 శాతం అందిస్తున్న మన్నారు. అలాగే మహిళలకు ప్రత్యేకమైన మహిళా డిపాజిట్ స్కీమును 18 నెలలకు గాను 7.65 శాతం చొప్పున అందిస్తున్నామని తెలిపారు. వివరాలకు రెప్కో బ్యాంక్ జి కార్ స్ట్రీట్ 0877-2258802, 9490181510 సంప్రదించాలని కోరారు.

## రాస్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఆర్యవర్క్పై ఉచిత శిక్షణ

పుత్తూరురూరల్, జూలై 21 ప్రభాతవార్త:

రాష్ట్రీయ సేవా సమితి రాస్ మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం శుక్రవారం పుత్తూరు మండలంలోని తడుకు పంచాయతీ వేణుగోపాలపురం గ్రామంలో టైలరింగ్, ఆర్యవర్క్పై ఉచిత శిక్షణ కోర్సు ను రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్(జేఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. 84 పని దినాలు బ్యాచ్కి 20 మంది మహిళల చొప్పున 40 మంది మహిళలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ శిక్షణ ప్రారంభోత్సవానికి వేణుగోపాలపురం సర్పంచ్ వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాస్ సంఘాలు చక్కటి ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేసుకున్నారని, అప్పులే కాకుండా చేతి వృత్తులను ప్రోత్సహించి తదనుగుణంగా ఆర్థిక ఆదాయ కార్యక్రమాలను పెంపొందించు కుంటున్నారని, ఈ సందర్భంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తదుపరి రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ అధికారి శ్రీహరి మాట్లాడుతూ పుత్తూరు పట్టణంలో టైలరింగ్ ఆర్యవర్క్ బ్యూటీషియన్ కంప్యూటర్ కోర్సులను నిర్వహిస్తున్నామని తదుపరి ప్రభుత్వ ధృవీకరణ పత్రాలు కూడా అందిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, బాలమ్మ, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 26న జాబ్మేళా

నగరి, జూలై 21 ప్రభాతవార్త:

నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్ మన్ సర్వీసెస్ సెంటర్ చెన్నై వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ బుధవారం కళాశాలలో టెలికాలర్ ఉద్యోగాల కొరకు జాబ్మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు, ప్రస్తుతం డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులన్నారు. ఈ ఉద్యోగాలకు నెలకు 13 వేల నుంచి 15 వేల వరకు జీతం, ఉచిత వసతిసదుపాయం ఉంటుందని ఆసక్తి గల అభ్యర్థులు మార్క్ లిస్టు జిరాక్స్, ఒరిజినల్ ఐడీ ప్రూఫ్తో ఈ నెల 26వ తేదీ కళాశాలలో జరిగే జాబ్మేళాలో ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని తెలియజేశారు.

## దేశంలో గిరిజన మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేదు

-మణిపూర్ ఘటన హృదయ విదారకం

-'గిరిజన నవ సమాజ్' వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్ నాయక్

తిరుపతి ప్రెస్క్లబ్,జూలై 21 ప్రభాతవార్త:

దేశంలో గిరిజన మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేదనే విషయం మణిపూర్లో జరిగిన దారుణాన్ని చూస్తే అర్థమవుతుందని 'గిరిజన నవ సమాజ్' వ్యవస్థాపక అధ్యక్షుడు పాలిత్యా శివశంకర్ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.మణిపూర్లో ఇద్దరు గిరిజన మహిలలను నగ్నంగా ఊరేగించి,వారిపై సామూహికంగా అత్యాచారం చేసి,హత్య చేసిన సంఘటన..దేశం యావత్ మానవజాతి సిగ్గుతో తలదించుకునే సందర్భమన్నారు.గత మే నెల 4వ తేదీ జరిగిన ఈ దారుణం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా ఉన్న భారత్లో జరగడం బాధాకరమన్నారు.అన్ని రంగాలలో అట్టడుగున ఉన్న గిరిజన జాతి మహిళల పట్ల దుండగులు రాక్షసంగా ప్రవర్తించి వారిని వివస్త్రలను చేసి ఊరేగించి,ఆ తరువాత సామూహిక అత్యాచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.అంతటితో ఆగకుండా ఆ ఘటనకు చెందిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో,దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని అన్నారు.ఇలాంటి హృదయ విదాకర సంఘటనపై కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం కడు శోచనీయమన్నారు.ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం స్పందించి,ఆ సంఘటనకు కారణమైన దుర్మార్గులను చట్ట ప్రకారం శిక్షించి,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## సిపిఎస్,జిపిఎస్ రద్దు కోసమే తమ పోరాటం

-ఏపిసిపిఎస్ఇఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర్ల కిరణ్



తిరుపతి ప్రెస్క్లబ్,జూలై 21 ప్రభాతవార్త:

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సిపిఎస్),గ్యారెంటీ పెన్షన్ స్కీమ్(జిపిఎస్)ల రద్దు కోసం,అలాగే ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపిఎస్) పునరుద్ధరణ కోసం తాము ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర్ల కిరణ్ స్పష్టం చేశారు.శుక్రవారం స్థానిక ప్రెస్క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన..తాజాగా సిపిఎస్ ఉద్యోగులందరూ కలిసి ఏకతాటిపై ఏకగ్రీవంగా ఎన్నుకున్న 34 మందితో కూడిన తిరుపతి జిల్లా అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రకటించారు.ఇందులో జిల్లా అధ్యక్షుడిగా వంకీపురం పవన్,జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎ.మణికంఠ,ప్రధాన కార్యదర్శిగా పివి.సుబ్బారెడ్డి,మహిళా అధ్యక్షురాలిగా జి.రేఖ,అధనపు ప్రధాన కార్యదర్శిగా బి.ధరణీకుమార్,ఆర్థిక కార్యదర్శిగా ఎన్.హేమంత్,స్టేట్ కౌన్సిలర్లుగా నలుగురు,జిల్లా ఉపాధ్యక్షులుగా 11 మంది,జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా మంజుల,11 మంది జాయింట్ సెక్రటరీలతో కలిపి మొత్తం 34 మందితో జిల్లా అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు.అనంతరం ఎన్నికయిన సభ్యులకు ఆయన నియామక పత్రాలను అందచేశారు.

## వసతి గృహ బాలికలకు విద్యాసామాగ్రి వితరణ

తిరుపతి ప్రెస్క్లబ్,జూలై 21 ప్రభాతవార్త:



శుక్రవారం స్థానిక జీవకోన,క్రాంతినగర్లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్య విద్యాలయం(బాలికల వసతి గృహం)నందు అక్కడి బాలికలకు తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.మునకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో లయన్ లోకేష్బాబు తన తండ్రి ఇ.గురుస్వామినాయుడు వర్ధంతి సందర్భంగా నిత్యవసర వస్తువులు,అలాగే విద్యాసామాగ్రి అయిన నోట్ బుక్కులు,పెన్నులు,పెన్సిళ్లు,తదితర వస్తువులు ఉచితంగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో దాత లోకేష్బాబు,క్లబ్ కార్యదర్శి ముబారక్ బాషా, కోశాధికారి వినోద్ వెంకటాచలం,సభ్యులు రాజేంద్రప్రసాద్,ఎమ్మార్ రాజా,మేరీ,సాకం కృష్ణమూర్తి ,మురళి,తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతిరూరల్, జూలై 21 ప్రభాతవార్త:

ఆర్.డి.ఓ. సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి, ఇఎస్ఐ ఫీడర్కు సంబంధించి చెట్లు తొలగింపులో భాగంగా ఈ క్రింది ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని సబ్ స్టేషన్ ఏఇ నాగరాజ ఒక ప్రకటనలో తెలిపారు. అవిలాల, భానునగర్, ధనలక్ష్మీనగర్, సుబ్బయ్యకాలనీ, లింగేశ్వర్నగర్ ప్రాంతాలలో ఉదయం 8:30గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

# పేదల సమస్యలపై తక్షణం స్పందించి ఆర్థిక సహాయం అందించాలి

**అధికారులను ఆదేశించిన సిఎం.. వెంటనే స్పందించిన జిల్లా యంత్రాంగం**
**అనారోగ్యంతో బాధ పడుతున్న రోగుల కుటుంబాలకు చెక్కులను అందజేసిన జేసి**

తిరుపతి కలెక్టరేట్, జులై 21, ప్రభాతవార్త
రాష్ట్ర ముఖ్యమంత్రి తిరుపతి జిల్లా వెంకటగిరిలో నేతన్న నేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమ పర్యటన పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో హెలిపాడ్ వద్ద ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అభివాదం తెలుపుతూ ఆర్థిక సహాయం కోసం అభ్యర్థించిన ప్రజలకి నేనున్నానని భరోసానిస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పలకరిస్తూ వారి సమస్యలను, ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి వారికి సిఎం రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహాయం అందించాలని, వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య పరీక్షలు చేయించాలని, ఆరోగ్యంగా ఉండాలని వారిని దీవిస్తూ వారి వైద్య ఖర్చులు ఉంటే చెల్లించాలని, జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న టెక్కలి మండల శ్రీపురం గ్రామ నాలుగు సంవత్సరాల చిన్నారి ఆరాధ్యకు లివర్ వ్యాధితో బాధపడుతున్న నెల్లూరు జిల్లా కందుకూరు మండలం 45 సంవత్సరం రామకృష్ణ, బ్లడ్ క్యాన్సర్ వ్యాధి కలిగిన నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంకు చెందిన ఐదు సంవత్సరాలు గ్రీస్కి లివర్ సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న శ్రీకాళహస్తి మండలం మన్నవరం గ్రామంకు చెందిన 55 సంవత్సరాలు చెంచయ్య, పక్షవాతంతో బాధపడుతున్న వెంకటగిరి టౌన్ 35 సంవత్సరాలు శివ, అనారోగ్యం సమస్యలతో బాధపడుతున్న వెంకటగిరికి చెందిన లక్ష్మి నరసయ్య, ఆర్థిక సహాయం కోరిన వెంకటగిరికి చెందిన 41 సంవత్సరాల పార్వతీ శాంతికి, వెన్నుముక వ్యాధికి సంబంధించి వెంకటగిరికి చెందిన శ్రీకాంత్ రెడ్డికి రూ. లక్ష వంతున, కండరాల వ్యాధితో బాధపడుతున్న 25 సంవత్సరాల కీర్తిపాటి ఉమాకు రూ. 3 లక్షలు జెసి డికె బాలాజీ జిల్లా కలెక్టర్ కె వెంకటరమణ రెడ్డి వారి సూచనల మేరకు అందిస్తూ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కడప జిల్లా మైదాకూరు మండలం 49 సంవత్సరాల జలజాక్షి తన చేస్తున్న ఉద్యోగంలో సమస్యలున్నాయని పరిష్కరించాలని, ఓబులవారిపల్లి రైల్వే కోదూరు మండలం చెంగయ్య ఉద్యోగం కావాలని కోరడంతో పరిష్కరించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులతో రాజకీయ నాయకులతో కలిసి ప్రశంగించారు.

## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం, వీడ్కోలు


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ప్రముఖులు

రేణిగుంట, జూలై 21 ప్రభాతవార్త:
రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 5వ విడత వైఎస్ఆర్ నేతన్న నేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమం తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్న నేపథ్యంలో ఉదయం 9.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో జగన్మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రితో ప ఆటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర క్రీడా సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి రోజా, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభియన్ రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, డీఐజీ అమ్మిరెడ్డి, రేణిగుంట తహసీల్దార్ ఉదయ్,సంతోష్, ఏర్పేడు తహసీల్దార్ శివప్రసాద్ తదితరులు ఉన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రరెడ్డిని ముఖ్యమంత్రి ఆప్యాయంగా తలనిమిరి పలకరించారు. ఉదయం 9.55 గంటలకు వెంకటగిరి బహిరంగ సభలో పాల్గొనుటకు ఆయన హెలికాప్టర్ లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమాలు ముగించుకుని అది హెలికాప్టర్‌లో రేణిగుంటకు వచ్చి విమానాశ్రయంలో పలువురు అధికార ప్రతినిధులు రాజకీయ ప్రముఖులు వీడ్కోలు పలుకుతుండగా ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు.

# టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారంటీ : గాలి భానుప్రకాష్


అమెరికాలోని డల్లాస్ నగరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గాలి భానుప్రకాష్

నగరి, జూలై 21 ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికి భవిష్యత్‌కు తెలుగుదేశం పార్టీతోనే గ్యారంటీ అని విజనరీ లీడర్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. అమెరికాలోని డల్లాస్ నగరంలో ఎన్ఆర్ఐ టీడీపీ డల్లాస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం అభిమానుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టి.డి.జనార్ధన్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు కోమటి జయరామ్‌తో కలసి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత నాలుగున్నర ఏళ్ళ వైసీపీ పాలనలో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని, వారిని ఆదుకోవడానికి వారి కష్టాలు తీర్చడానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. ఎంతో వైభవం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేడు రాజధాని లేని రాష్ట్రంగా మూడు ముక్కల రాజధానులున్న రాష్ట్రంగా మిగిలిపోయింది. రాష్ట్ర భవిష్యత్ బాగుపడాలన్నా సుస్థిర రాజధాని ఏర్పాటు చేసుకోవాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి చంద్రబాబు ఆయనకు ముఖ్యమంత్రి పదవి అవసరం కన్నా చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉందని, దీనికి ఎన్ఆర్ఐ టీడీపీ అభిమానులు సైతం సహకరించాలని కోరారు. చంద్రబాబు హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐటీ రంగం ఎంతో అభివృద్ధి చెందడంతో దేశ, విదేశాల్లో తెలుగువారు స్థిర పడ్డారు. వారందరూ కృతజ్ఞతాభావంతో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. డల్లాస్ సిటీలో తెలుగుదేశం అభిమానుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ టీడీపీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ తెలుగుదేశం పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మహిళ అభ్యుదయమే లక్ష్యంగా....

## ప్రభుత్వ పథకాలు మంజూరు

**-మహిళా భవన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి**



తిరుపతిరూరల్, జూలై21 ప్రభాతవార్త:
మహిళాభ్యుదయమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నట్లు చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మంగళం పరిధిలోని రణధీరపురం గ్రామ పంచాయతీ పరిధిలో స్వయం సహాయక సంఘాల సమావేశాల నిర్వాహణ కోసం ఏర్పాటు చేసిన మహిళా భవనాన్ని మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీ ఎక్కడ గౌరవింపబడితే ఆ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందుతున్న నానుడితో సి.ఎం. జగనన్న సంక్షేమ పథకాల మంజూరులో వారికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమ్మఒడి, చేయూత, ఇంటిపట్టాలు వంటి తదితర పథకాల పేరుతోనే ఇచ్చారని గుర్తు చేసారు. రణధీరపురం పంచాయతీ పరిధిలో 94 సంఘాలు, 3గ్రామ సమాఖ్యలు ఉన్నాయని తెలిపారు. వీరందరికి రూ.21.85 కోట్లు బ్యాంక్ ఋణాలు అందజేసినట్లు చెప్పారు. రూ.55.47 లక్షల సున్నా వడ్డీ రుణాలతో పాటు రూ.1.80 కోట్ల శ్రీనిధి బ్యాంక్ నుంచి రుణాలు అందించామని వివరించారు. ఆసరా పథకం కింద 756మందికి 3.75 కోట్లు నిధులు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రణధీరపురం గ్రామ సర్పంచ్ లీలావతి లక్ష్మీనారాయణ, ఉప మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, ఎంపిటిసి నారాయణరెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాలకు పన్ను ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేయండి

**కమిషనర్ హరిత**

తిరుపతి కార్పొరేషన్, జులై 21, ప్రభాతవార్త



తిరుపతి నగరంలోని ఖాళీ స్థలాలకు ఈఆర్పి అసెస్మెంట్ నెంబరు ఉండి, పన్ను కట్టించుకునే రసీదులు ఉంటేనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వాటి క్రయ, విక్రయాలకు అనుమతించండని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత కోరారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం డిస్ట్రిక్ట్ రిజిస్టర్, తిరుపతి సబ్ రిజిస్ట్రార్, రేణిగుంట సబ్ రిజిస్టర్‌లతో జరిగిన ప్రత్యేక సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొనగా, కమిషనర్ హరిత మాట్లాడుతూ ఖాళీ స్థలాల క్రయ, విక్రయాలకు జరిగే ప్రకియలో, సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చినటువంటి వాటి ల్యాండ్ యొక్క వేకెంట్ ల్యాండ్ టాక్స్ ఉండే వాటినే పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేస్తూ ఖాళీ స్థలాలు ఏదైనా సరే క్రయ, విక్రయాలు జరిగేటప్పుడు తప్పనిసరిగా వేకండ్ ల్యాండ్ ట్యాక్స్ ఉండేటట్లు చూడాలని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకుని మీరు కూడా సహకరించాలని కమిషనర్ హరిత కోరారు. తిరుపతి నగరంలో ఇప్పటికే 1900 ఖాళీ స్థలాలపై పన్ను విధించడం జరుగుతున్నదని, కానీ మరో 6000 కు పైగా ఖాళీ స్థలాలకు పన్ను విధించాల్సి ఉందని, ఆ స్థలాలను, వాటి యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేసే ప్రక్రియ కూడా మొదలు పెట్టినట్లు కమిషనర్ హరిత వివరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ రిజిస్ట్రార్ శ్రీ రామ్ కుమార్, తిరుపతి సబ్ రిజిస్ట్రార్ ఆనందన్, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ శోభారాణి, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, కేఎల్ వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నుంచి సిఎం సభకు భారీగా తరలి వెళ్ళిన అభిమానులు

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్),జూలై 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి వెంకటగిరిలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి బహిరంగ సభకు భారీ ఎత్తున జనం తరలి వెళ్ళారు. నేతన్నకు భరోసా కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాగా ఆ బహిరంగ సభకు శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి ప్రతిష్టాత్మకంగా తమ కార్యకర్తలను తరలించేందుకు తమ పార్టీ కార్యకర్తలను ఆదేశించారు. దాంతో మండల నాయకులు పట్టుదలగా బస్సులను ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి బహిరంగ సభకు జనాన్ని తరలించారు. ఏర్పేడు మండలంనుంచి భారీ ఎత్తున బస్సులను ఏర్పాటు చేసి తరలించారు. అధికార పార్టీ నాయకులు సుమారు మండలంలో 25 బస్సులను ఏర్పాటు చేసారు. మొదట స్కూల్ బస్సులను కూడా కోరారు.కానీ శుక్రవారం వినియోగించుకోలేదు.పాపానాయుడుపేట నుంచి పల్లం వరకు బస్సులు వరుస కట్టి జనాన్ని సేకరించారు. కాగా పల్లం నుంచి మోటార్‌సైకిల్ ర్యాలి ఏర్పాటు చేసారు. దాంతో ఈ మార్గమంతా జనమయమైంది,

## ప్రాచీన భారతీయ శాస్త్రాల పరిచయంపై అతిథి ఉపన్యాసం

తిరుపతి టౌన్, జులై 21, ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థలో శుక్రవారం సాయంత్రం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో ప్రాచీన భారతీయ శాస్త్రాల పరిచయంపై అతిధి ఉపన్యాయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా టిటిడి జేఈవో, స్విమ్స్ సంచాలకులు, ఉపకుల పతి సదా భార్గవి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు దోహదపడుతున్న టిటిడి ఈవో ఎవి ధర్మా రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు. ప్రాచీన కాలములో మన ఆరోగ్య అలవాట్లను బట్టి ఎంత ఆరోగ్యంగా ఉన్నామో తెలిసేదన్నారు. నేటి ఆహార అలవాట్లు మనిషి ఆరోగ్యం త్వరగా క్షీణించే విధంగా ఉన్నాయన్నారు. ప్రాచీన కాలంలో కూడా మంచి ప్రోటీన్స్‌తో కూడిన ఆహార అలవాట్లుతో ఉండేవని తెలిపారు. ఈ విషయాలను ప్రపంచానికి వివరించడానికి ఈ కార్యక్రమం నిరంతరంగా వేదిక్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదా శివమూర్తి గారి ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీ వెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదా శివమూర్తి మాట్లాడుతూ ప్రాచీన భారతీయ శాస్త్రీయ పరిజ్ఞానం గురించి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాచీన వైజ్ఞానిక గొప్పదనం గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేసారు. అనంతరం స్విమ్స్ డైరెక్టర్‌చే రాణి సదాశివమూర్తికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అపర్ణ బిట్లా, డాక్టర్ రామ్, డాక్టర్ శరన్ బి సింగ్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ మాధవి, డాక్టర్ మధుబాబు, డాక్టర్ కోటి రెడ్డి, వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మెడికల్ కాలేజీ విద్యార్థినులు, స్విమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

శ్రీకాళహస్తి, జులై 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి శుక్రవారం ఐఎఎస్ అధికారి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మరియు సమగ్రశిక్ష రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఎ.శ్రీదేవసేన కుటుంబ సభ్యులతో విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు దక్షిణగో పురం వద్ద స్వాగతం పలికారు. ఆలయంలో మహిమాన్వితంగా నిర్వహించే రాహుకేతు పూజలు నిర్వహించుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం వీరికి దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు.

## గణనాధుని సేవలో ఇన్‌కంట్యాక్స్ అదనపు డైరెక్టర్

కాణిపాకం, జులై 21 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఇన్‌కం టాక్స్ అడిషనల్ డైరెక్టర్ రాఘవేంద్రరావు శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులను సత్కరించిన రాయలసీమ రంగస్థలి

తిరుపతి కార్పొరేషన్, జులై 21, ప్రభాతవార్త



వివిధ వేషధారణలతో ప్రేక్షకులను రంజింపజేస్తూ, తెలుగు నాటక రంగానికి ఊపిరి పోస్తూ తెలుగు పద్యాన్ని కాపాడుతున్న కళాకారులు ఇటీవల తిరుపతి గంగమ్మ జాతరలో ఐదు వారాలు క్రమం తప్పకుండా పురాణ పురుషుల వేషధారణలతో భక్తులను అలరించారు. వారి భక్తి భావాలకు నిదర్శనంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి సారథ్యంలో కెఎన్ రాజా కార్యక్రమ నిర్వహణలో 20 మంది కళాకారులను జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. సన్మానం అందుకున్న కళాకారులలో విద్వాన్ పద్మనాభన్, పొన్నాల జెజిరెడ్డి, శాంబోలు హరినాథ్ బాబు, కె. కేశవుల రెడ్డి, ఎం. కోదండపాణి, ఎం. గంగయ్య, సాయి నవీనకవిత, చంద్రబాబు నాయుడు, కె. చంగారెడ్డి, టి. సుబ్రమణ్యం రెడ్డి రాజశేఖర్ రెడ్డి, పి. మునిసుబ్రమణ్యం, ముని, హేమంత్, దీపక్ యాదవ్, విజయకుమార్ రెడ్డి ఉన్నారు.

## శ్రీసిటీలో అత్యాధునిక కెర్రీ ఇండేవ్ లాజిస్టిక్స్ కేంద్రం ప్రారంభం

సత్యవేడు, జూలై 21,ప్రభాతవార్త:




భారతదేశంలోని ప్రముఖ ఇంటిగ్రేటెడ్ 3పిఎల్ సేవల సంస్థ కెర్రీ లాజిస్టిక్స్ నెట్‌వర్క్, శ్రీసిటీలో 3లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నూతన అత్యాధునిక లాజిస్టిక్స్ కేంద్రాన్ని శుక్రువారం ప్రారంభించింది. ప్రత్యేకంగా మిత్సుబిసి ఎలక్ట్రిక్ ఇండియా ఆపరేషన్స్ ఏసిల వ్యాపారం కోసం ఇది పనిచేయనుంది. పరిశ్రమ ఆవరణలో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలలో మిత్సుబిసి ఎలక్ట్రిక్స్ జనరల్ మేనేజర్ మసకాజు ఒబాటా నూతన కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా కెర్రీ ఇండేవ్ ఛైర్మేన్ డాక్టర్ జేవియర్ బ్రిట్టో మాట్లాడుతూ కెర్రీ ఇండేవ్ సంస్థ పట్టుక, ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. సంస్థ ఎదుగుదలకు మద్దతిచ్చిన సహచరులు, ఖాతాదారులందరికి ధన్యవాదాలు తెలిపారు. నూతన ప్లాంట్: ఏర్పాటుకు సంబంధించి కెర్రీ లాజిస్టిక్స్, మిత్సుబిసి ఎలక్ట్రిక్ బృందాలను అభినందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ప్రస్తుత పారిశ్రామిక రంగంలో లాజిస్టిక్స్, వేర్‌హౌస్ సేవల ప్రాముఖ్యతను వివరించారు. ఈకార్యక్రమంలో మిత్సుబి ఎలక్ట్రిక్ ప్లానింగ్‌హెడ్ గణపతి శంకర్, ఇండోస్పేస్ ఎగ్జిగ్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ కళ్యాణ్, కెర్రీ సౌత్ ఈస్ట్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ అలెన్ అప్‌లు పాల్గొన్నారు.
ఫోటో రైటప్:3: శ్రీసిటీ కెర్రీ ఇండేవ్ లాజిస్టిక్స్ కేంద్రం ప్రారంభోత్సవ దృశ్యము

# జనసేనకు వస్తున్న ఆదరణ చూడలేకే సిఎం విమర్శలు

**జనసేన జిల్లా అధ్యక్షుడు**
**డా॥పసుపులేటి హరిప్రసాద్ హెచ్చరిక**



తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 21 ప్రభాతవార్త:
వారాహి యాత్ర ప్రారంభించిన నాటి నుండి తమ అధినేత పవన్‌కళ్యాణ్‌కు ప్రజల నుండి వస్తున్న విశేష ఆదరణ చూసి తట్టుకోలేకే..అటు సిఎం జగన్ నుండి ఇటు మంత్రులు,ఎమ్మెల్యేల వరకు పవన్‌పై విమర్శల వర్షం కురిపిస్తున్నారని జనసేన పిఎసి సభ్యుడు,ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ మండిపడ్డారు.శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పవన్‌ను విమర్శించడానికి ఏమీలేక పదే పదే ఆయన మూడు పెళ్లిల్ల గురించి ప్రస్తావించడం వైసిపి నీచ,దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఛీత్కరించారు.విద్యార్థులు జగన్ సభకు హాజరయితే వారికి విద్య గురించి,బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని,విద్య కోసం పలానా సంస్కరణలు తీసుకొచ్చానని చెప్పడం మాని,పిల్లల ముందు పవన్ మూడు పెళ్లిల్ల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు.తాజాగా శుక్రవారం వెంకటగిరిలో జరిగిన 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' కార్యక్రమంలో సైతం సిఎం జగన్ అవే వ్యాఖ్యలు చేయడం ఆయన నీచ సంస్కృతికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.ఇక నుండి తమ అధినేతపై చవకబారు విమర్శలు చేయడం, అవాకులు చవాకులు పేలడం చేస్తే..చూస్తూ ఊరుకోమని,తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.అలాగే మంత్రి రోజా ఏనాడూ తన టూరిజం శాఖ గురించి,పర్యాటక రంగంలో పలు అభివృద్ధి పనులు చేశామని మీడియా ముందు సమావేశం నిర్వహించి చెప్పిందిలేదు.ఎంతసేపూ ఆమె వ్యక్తిగత టూర్లు చేయడం తప్ప ఆమె శాఖకు ఏమాత్రం న్యాయం చేయడం లేదు.ఒక మంత్రిగా అర్హురాలు కాని రోజా సైతం పవన్‌కళ్యాణ్,జనసేన పార్టీపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## గ్రామదేవతకు అక్కగార్ల కాలనీ వాసుల పొంగళ్ళు

చంద్రగిరి, జూలై 21 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారికి అక్కగార్ల కాలనీ వాసులు శుక్రవారం పొంగళ్ళు సమర్పించుకుని తమ మ్రొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా వేకువజాము నుండి మహిళలు, యువకులు, పెద్దలు స్నానాధులు ఆచరించి నూతన వస్త్రాలతో సిద్దమై మేళాతాళాలు, బ్యాండు బాజాలు పలకల దరువులు, భాణా సంఛాపేళుళ్ళ నడుమ మహిళలు పొంగళ్ళ బుట్టలను మోసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్ళు తయారు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పండుగ వేళ బంధుమిత్రుల రాకతో కాలనీ కళకళలాడింది. జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసి చంద్రమౌళి రెడ్డి, ఉపసర్పంచ్ నగరి చంద్రశేఖర్ రెడ్డి, గురుమూర్తి రెడ్డి, విశ్వనాథం, కృష్ణయ్య, లోకనాథరెడ్డి, అంజి, తదితరులు పాల్గొన్నారు.